నవతెలంగాణ
మనసున్న తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | మార్చి 15, 2025 | www.navatelangana.com

ఎండీఎం పై విద్యా కమిషన్ రిపోర్టు బట్టబయలు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎండీఎం నిర్వహణపై విద్యా కమిషన్ రిపోర్టు బట్టబయలు చేయాలని ఏఐటీయూసీ అనుబంధన ఎండీఎం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరు చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటాల రాములతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వార్త పత్రికల్లో వారనికి నాలుగు రోజులు కోడిగుడ్లు పెట్టాలి, రెండు రోజులు అరటిపండ్లు ఇవ్వాలి, మహిళా సంఘాలకు అప్పజెప్తామని రకరకాలుగా కథనాలు వస్తుండటంతో కార్మికుల్లో అలజడ, అభద్రతాభావంగా ఏర్పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం లేని పక్షంలో, విద్యా కమిషన్ మధ్యాహ్న భోజన పథకంపై నివేదికను బట్టబయలు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



నేటి నుంచి పాఠశాలల్లో ఏఐ ద్వారా బోధన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ (ఏఐ) ద్వారా శనివారం నుంచి బోధన చేయడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. తలమడుగు మండలం దేవాపూర్‌లోని తెలుగు, ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలల్లో, ఖోడద్, ఆదిలాబాద్ అర్బన్ తాటిగూడ ప్రాథమిక పాఠశాలల్లో ఈ బోధన విధానాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీఈఆర్టీ, సమగ్ర శిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో మౌళిక భాష, గణిత సామర్థ్యాల సాధనలో కృత్రిమ మేథను ఉపయోగించి బోధనను మెరుగుపరచడానికి ఏఎక్స్ఎల్, ఏక్స్టెప్ ఫౌండేషన్ సహకారంతో పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో 9 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించగా ముందుగా ఈ నాలుగు పాఠశాలలో ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో మెరుగైన అభ్యసన సామర్థ్యాలను సాధించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఆదిలాబాద్ ప్రత్యేకత.. వార సంతలు..!





షాపింగ్‌మాల్స్, సూపర్‌బజార్లు..పేరేదైనా నేటి ఆధునిక జీవితానికి అలవాటైన షాపింగ్. ఒకప్పుడు పెద్దపెద్ద పట్టణాలకే పరిమితమైన షాపింగ్‌మాల్స్ ప్రస్తుతం చిన్న పట్టణాలకు సైతం విస్తరించాయి. ఇలా వెళ్లి అలా మనకవసరమైన వస్తువులు తెచ్చుకునేలా ఇవి ఉన్నాయి. అయితే మరోపక్క అనాదిగా క్రయవిక్రయాలకు పేరొందిన సంతలకు నేటికీ ఆదరణ ఏమాత్రమూ తగ్గలేదు. పట్టణ వాతావరణం అంతగా లేని మారుమూల ప్రాంతాలు మొదలుకొని, ఆనవాయితీగా వస్తున్న ప్రాంతాల్లో వీటి ప్రాభవం చెక్కుచెదరలేదు. గ్రామీణుల జీవితాలతో పెనవేసుకున్న వార సంతల గురించి ప్రత్యేక కథనం...

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పల్లెవాసుల జీవితాలకు వార సంతలతో ప్రత్యేక అనుబంధం ఉంది. నేటికీ గ్రామీణులు వార సంతలపై ఆధారపడి వారానికి సరిపడా వస్తువులు సమకూర్చుంటున్నారంటే అతిశయోక్తికాదు. ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు వార సంతలతో విడదీయరాని అనుబంధం పెనవేసుకొని ఉంది. రవాణా వ్యవస్థ అంతగా అభివృద్ధి చెందని ఆ రోజుల్లో సంతలు ప్రజల అవసరాలు తీర్చేవి ఉండేవి. రానురాను వాటి అవసరం లేకుండా మార్కెట్ విస్తరించింది. ప్రస్తుతమైతే ప్రత్యేకించి పట్టణవాసులకు చేతిలో ఓ స్మార్ట్ ఫోనుంటే చాలు మంచం దిగకుండానే కావాల్సిన సరుకులను ఇంటికి తెప్పించుకోవచ్చు. అయితే నాణేనానికి ఒక వైపు మాత్రమే. నేటికీ ఏరోజుకారోజు, వారానికి సరిపడా మాత్రమే సరుకులు కొనుగోలు చేసుకొని జీవించే ప్రజలు అన్ని ప్రాంతాల్లో ఉన్నారు. ఇప్పుడొచ్చిన ఈ మాల్స్ వారికేమీ తెలియవు. వారికి తెలిసిందల్లా వార సంతలు, చిల్లర కొట్టులే. ఇలా ఆదిలాబాద్ లాంటి వెనుకబడిన ప్రాంతాల్లో వార సంతలకు నేటికీ ఆదరణ తగ్గలేదు. ప్రజల జీవనవిధానంలో భాగంగా ఉన్నాయి. దశాబ్దాలు గడిచినా, షాపింగ్‌మాల్, సూపర్‌బజార్‌లకు దీటుగా గ్రామీణ సంతలు నూతన రూపురేఖలు సంతరించుకుంటున్నాయి. ప్రజల అవసరాలను తీర్చుతున్నాయి. అంగడిబజార్లలో కూరగాయల నుంచి మొదలుకొని అన్ని రకాల గృహోపకరణాలు, నిత్యావసర సరుకులు, పెండ్లిండ్లు, పేరంటాలకు, వివిధ రకాల వేడుకలకు అవసరమైన వస్తువులు ఒకేచోట అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి. ఇలా గ్రామీణులు నానాటికీ ఈ వారసంతలను ఆదరిస్తూ వస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు సైతం సంతలో వారికి అవసరమైన వస్తువులను సరసమైన ధరలకు అందుబాటులో ఉంచుతున్నారు. డివిజన్, మండల కేంద్రాలతో పాటు పెద్ద పెద్ద గ్రామ పంచాయతీల ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసే వార సంతల్లో రైతులు, కూలీలకు అవసరమైన వస్తువులు దొరుకుతున్నాయి. ప్రజలు వారానికి సరిపడా వస్తువులు ఒకేసారి కొనుగోలు చేస్తుంటారు. గతంలో అంగడికి వచ్చేవారు ఇంటి నుండి ధాన్యాన్ని తీసుకొచ్చి వాటిని విక్రయించి తమకు వారానికి సరిపడా సరుకులు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం పరిస్థితి మారింది. డబ్బులు చెల్లించి వస్తువులను కొనుగోలు చేస్తున్నారు.

ఉట్నూర్ వారసంత ప్రత్యేకత ఇది

ఏజెన్సీ ప్రాంతానికి ఉట్నూర్ తలమానికం. ఇక్కడ నిర్వహించే వారసంతకో ప్రత్యేకత ఉంది. ఏజెన్సీ మారుమూల ప్రాంతాల నుండి కూరగాయలు, పండించిన ధాన్యాలు విక్రయించేందుకు వ్యాపారులు ఉట్నూర్ వారసంతకు వస్తుంటారు. పెళ్లి, శుభకార్యాలకు కావాల్సిన ప్రతి వస్తువు ఉట్నూర్ వారసంతలో లభించడం ప్రత్యేకత. ఇక్కడి వారసంతలో జిల్లాలో ఎక్కడా దొరకని తాజా కూరగాయలు దొరుకుతాయి. ఆదివారం వారసంత ఉందంటే చాలు ఇక్కడి కొనుదారుల కంటే బయట వ్యాపారులు ఎక్కువగా వస్తుంటారు. ఇక్కడ కొనుగోలు చేసిన కూరగాయలను వ్యాపారులు ఇతర ప్రాంతాల మార్కెట్‌లో అమ్ముకుంటారు. ఈ సంతలో ధరలు కూడా ప్రజలకు అందుబాటులోనే ఉంటాయి. పొలాల పండగ సమయంలో ఇక్కడి వారసంత గిరిజనులతో సందడిగా మారుతుంది. దీంతో పాటు గిరిజనులు జరుపుకునే ప్రతి పండగకు ఇక్కడి వారసంత కిక్కిరిసిపోతుంది. పెండ్లి సీజన్‌లోనైతే వారసంత కొత్త శోభను సంతరించుకుంటుంది.

నాడు ఎద్దులపురం నేడు ఆదిలాబాద్

ప్రస్తుతం ఆదిలాబాద్ ఒకప్పుడు ఎద్దులపురంగా ఉండేది. ఎద్దులపురం నుండి క్రమేపి ఎదులపురం ఆ తర్వాత ఆదిలాబాద్‌గా మార్పు చెందింది. ఈ ప్రాంతం ఒకప్పుడు బీజాపూర్ రాజ్యంలో ఉండేది. ఆ రాజ్యానికి రాజు అలీఅహ్మద్‌షా. ఆయన హత్యకు గురైన తర్వాత ఆయన తొమ్మిదేండ్ల కుమారుడే రాజుగా నియమింపబడ్డాడు. కానీ వ్యవహారాలన్నీ తండ్రి వద్ద మంత్రిగా ఉన్న మహారాష్ట్ర వాసి చూసేవాడు. దానికి కృతజ్ఞతగా ఆ బుల్లి రాజు ఇబ్రహీం ఆదిలాషా ఈ ప్రాంతాన్ని ఆ మంత్రికి జాగీర్దారుగా ఇచ్చాడు. దీనికి ఆ మంత్రి ఆదిల్‌షా బాద్(ఆదిలాషా-ఆబాద్) (ఆబాద్ అంటే నివాసం ఉండే ప్రాంతమని పేరు) పెట్టారు. కాలక్రమంలో ఆ పేరే ఆదిలాబాద్‌గా మారింది. పూర్వం ఈ ప్రాంతంలో ఎద్దుల వ్యాపారం ఎక్కువగా జరిగేది. దీంతో ఎద్దులపురంగా ఆ తర్వాత ఎదులాపురం అని పిలిచేవారు. కాలక్రమేణ రూపాంతరం చెంది ఎదులాబాద్. ఆ తర్వాత ఆదిలాబాద్‌గా మారింది. ఏదేమైనా ఆదిలాబాద్ జిల్లాలో పశువుల అంగళ్లు నేటికీ కొనసాగుతున్నాయి. పశువుల సంఖ్య నాటితో పోల్చుకుంటే తగ్గినా ప్రధానంగా జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్, ఇచ్చోడ ప్రాంతాల్లో నేటికీ పెద్ద ఎత్తుననే పశువుల సంతలు కొనసాగుతున్నాయి. వీటితో పాటు బేల మండల కేంద్రంతో పాటు సాంగిడి గ్రామంలో ఎద్దుల అంగడి నిర్వహిస్తుంటారు.

ఏడు రోజులు..ఏడు వారసంతలు.. ఏజెన్సీ ప్రత్యేకత

ఏజెన్సీలోని ప్రజలు ఏదీ కొనాలన్నా వార సంతలే ముఖ్యం. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉంది. వారంలో ఏడు రోజులుంటే ఏడు వార సంతలు కూడా ఉన్నాయి. ఆదివారం ఉట్నూర్, కెరమెరి, సోమవారం ఇంద్రవెల్లి, మంగళవారం శ్యాంపూర్, బుధవారం నార్నూర్, ముత్నూర్, తాడిహత్నూర్, దంతన్‌పెల్లి, గురువారం జైనూర్, శుక్రవారం సిర్పూర్(యు) ఎక్స్‌రోడ్, శనివారం హస్నాపూర్‌లో వారసంతలు ఏర్పాటు చేస్తారు. ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజనులు దశాబ్దాలుగా వారికి కావల్సిన ఆహార వస్తువుల నుండి శుభకార్యాల వరకు కావల్సిన వస్తువులను ఈ వార సంతల్లో కొనుగొలు చేసుకుంటారు. ఇందులో జైనూర్ వారసంత ఆదివాసులకు పెద్ద వారసంతకు పేరుగాంచింది. జైనూర్ మండలం పరిధిలో ఎక్కువగా ఆదివాసీ గూడేలు, తండాలు ఉన్నాయి. ఆ తర్వాత ఏజెన్సీలో ఆదివాసులకు ప్రత్యేక వారసంత అంటే ఉట్నూర్ వారసంతనే. ఏడు వార సంతల్లో కెరమెరి, జైనూర్, ఎక్స్‌రోడ్ వారసంతలో పశువుల సంత కూడ నిర్వహిస్తారు. ఆదివాసీ గిరిజనులకు కావల్సిన సరుకులను వ్యాపారులు సంతల్లో అందుబాటులో ఉంచుతారు. గిరిజనులు పెళ్లి వస్తువులతో పాటు దుస్తులు, పండగలకు కావాల్సిన సామాగ్రి తదితర వాటిని వార సంతల్లో కొనుగోలు చేసేందుకు వస్తుంటారు.

ప్రత్యేకంగా దసరా, దీపావళి పండగల సీజన్‌లో ఎద్దుల క్రయవిక్రయాలు పెద్ద సంఖ్యలో జరుగుతుంటాయి. ఆదిలాబాద్ సరిహద్దు మహారాష్ట్రలోని ఘాటంజి, పాంఢ్రకవడ పట్టణాల్లోనూ పశువుల సంతలు నిర్వహిస్తుంటారు. ప్రధానంగా పశువుల సంతలు ఎక్కడైన శని, ఆది, సోమ వారాల్లో జరుగుతుంటాయి. పశు సంతతి తగ్గుతున్న నేపథ్యంలో పశువుల ధరలు భారీగా పెరిగాయి. 10, 20 సంవత్సరాలతో పోల్చుకుంటే ధరలు రెట్టింపయ్యాయి. ఒక ఎద్దుల జత రూ.లక్ష వరకూ పలుకుతుండడం బట్టి చూస్తే డిమాండ్ ఏ మేర ఉందో అర్థమవుతోంది. ఎద్దుల వయస్సును బట్టి ధర పలుకుతుంది.

పశువు సంతకు పేరుగాంచిన ఇచ్చోడ

ఇచ్చోడ మండల కేంద్రం సైతం పశువుల సంతకు పేరుగాంచింది. ప్రతి సోమవారం వారసంతతో పాటు పశువుల సంత జరుగుతుంది. మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు సమీపంలో పశువుల సంత నిర్వహిస్తుంటారు. సంతకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానే కాకుండా నిజామాబాద్, నందిపేట, ఆర్మూర్, మహారాష్ట్ర రాష్ట్రం నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి వస్తుంటారు. సంతలో ఎద్దులు, ఆవులు, మేకలు, గొర్రెల క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. పంచాయతీ ఆధ్వర్యంలో సంతకు వేలం పాట నిర్వహించి వ్యక్తులకు అప్పగిస్తుంటారు. మేకల సంతకు రూ.3లక్షలకు పైగానే వేలం పలుకుతుండడం చూస్తుంటే ఎంత పెద్ద ఎత్తున వ్యాపారం జరుగుతుందో అర్థమవుతోంది. పశువుల సంతతో పాటు వార సంతకూ ఈ ప్రాంతంలో ప్రాధాన్యత ఉంది. ఇచ్చోడ ఇటీవల కాలంలో అభివృద్ధి దిశగా అడుగులేస్తోంది. జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్ తర్వాత ఇచ్చోడ ముఖ్యమైన పట్టణంగా మార్పు చెందుతోంది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఇచ్చోడ వ్యాపార కేంద్రంగా ఉంది. ఈ ప్రాంత వాసులు అనాదిగా వార సంతకు అలవాటు పడ్డారు. వారానికి సరిపడా అన్ని రకాల వస్తువులు కొనుగోలు చేసుకుంటారు. వ్యాపారులు సైతం దూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఇచ్చోడతో పాటు ప్రతి మంగళవారం బోథ్, శనివారం నేరడిగొండ, శుక్రవారం గుడిహత్నూర్, గురువారం బజార్‌హత్నూర్, బుధవారం సొనాల ప్రాంతాల్లో వారసంతలు జరుగుతున్నాయి. వ్యాపారులు ప్రతి రోజు రోజుకోచోటకు చేరుకొని అక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారు.



ఉట్నూర్‌లో సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



ఆదిలాబాద్‌లో ఎద్దుల సంత

సంతలకు సౌకర్యాలలేమి

సంతల ద్వారా గ్రామ పంచాయతీలకు ప్రతి సంవత్సరం లక్షల్లో ఆదాయం వస్తోంది. కానీ సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంతలకు ప్రత్యేక స్థలాలు అంటూ లేవు. ప్రధాన కూడళ్లలో రోడ్లల కిరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకొని వస్తువులను విక్రయిస్తుంటారు. వర్షాకాలంలో అవస్థల మధ్య ఈ సంతలు కొనసాగుతున్నాయి. అడుగు తీసి అడుగేయడానికి వీల్లేకుండా బురదలోనే వినియోగదారులు వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వ్యాపారులు సైతం అతి కష్టం మీద దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తుంటారు. పశువుల సంతలకు సైతం చాలా కాలంగా సౌకర్యాల లేమి వెంటాడుతోంది. పశువులకు కనీసం తాగు నీటి సౌకర్యాలు లేవు. పశువులను వాన, ఎండలోనే ఉంచాల్సిన దుస్థితి ఉంది. వ్యాపారులు సైతం ఎండ, వర్షంలోనే కొనుగోలుదారుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. వేలం పాట ద్వారా సంత నిర్వహణను దక్కించుకున్న వ్యక్తులు పశువుల జోడికి రూ.400 వసూలు చేస్తుంటారు. కూరగాయల మార్కెట్ సైతం కూరగాయలు అమ్ముకోవడానికి సదరు వ్యాపారులు, రైతులు రూ.100 చెల్లిస్తుంటారు. వేలం దక్కించుకున్న వ్యక్తి ఇలా వారం వారం డబ్బులు వసూలు చేస్తుంటాడు. పంచాయతీకి మాత్రం సంవత్సరానికి ఒకసారి వేలంలో పలికిన ధరను చెల్లించాల్సి ఉంటుంది. ఒక ఇచ్చోడ వారసంతకే సంవత్సరానికి రూ.6లక్షల ఆదాయం వస్తోందని అంచనా. ఇలా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వందల సంఖ్యలో వార సంతలు జరుగుతుంటాయి. అంటే ఈ సంతల ద్వారా కోట్లలో వ్యాపారం సాగుతోందని తెలుస్తోంది. అయితే ఈ వార సంతలకు ప్రత్యేక స్థలాలు కేటాయించి షెడ్లు ఏర్పాటు చేస్తే వ్యాపారులకు, వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

హోలీ వేళ విషాదం

- పదో తరగతి విద్యార్థి మృతి
- మరొక విద్యార్థికి గాయాలు



మృతి చెందిన రుషికుమార్(ఫైల్)

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో హోలీ వేడుకల్లో విషాదం నెలకొంది. పట్టణంలోని కొత్త కుమ్మరివాడకు చెందిన జిల్లెడ్‌వార్ రుషికుమార్, ప్రేమ్ రంగులు చల్లుకుంటూ ద్విచక్రవాహనం వెళ్లారు. ఈ క్రమంలో వారి వాహనం ఏరోడ్రమ్ వద్ద అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. దీంతో రుషి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రేమ్‌కు తీవ్రగాయాలు కావడంతో రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ రిమ్స్‌కు చేరుకొని వివరాలు సేకరించారు. గాయాలపాలైన ప్రేమ్‌కు అందిస్తున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు విద్యార్థులు పట్టణంలోని సేవాదాస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థి చనిపోవడంతో తల్లిదండ్రులతో పాటు తోటి విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సునీల్ కుమార్ తెలిపారు. అనుకోకుండా జరిగిన ఘటన కారణంగా పండుగ పూట విషాదం నెలకొనడంతో విద్యార్థి కుటుంబం శోకసంద్రంలో మునిగింది.

అతిథుల ఆవేదన ఆలకించేనా..?

- జెఎల్‌ల నియామకంతో ఇంటికేనా?
- ప్రభుత్వం నిర్ణయంపై ఆశగా ఎదురుచూపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2014 నుండి విధులు నిర్వర్తిస్తున్న అతిథి అధ్యాపకుల పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్వహించిన జూనియర్ అధ్యాపకుల పరీక్షకు సంబంధించిన ఫలితాలు విడుదల చేసి పోస్టింగ్ ఇవ్వడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



ఉమ్మడి జిల్లాలో 186 మంది

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 46 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 186 మంది అతిథి అధ్యాపకులు పది సంవత్సరాల నుండి పనిచేస్తున్నారు. వీరిలో మంచిర్యాలలో 10 కళాశాలలో 54 మంది, కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో 11 కళాశాలలో 40 మంది, నిర్మల్‌లో 12 కళాశాలలో 39 మంది, ఆదిలాబాద్‌లో 13 కళాశాలలో 53 మంది పని చేస్తున్నారు.

జెఎల్ నియామకాలతో కొత్త కష్టాలు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జూనియర్ కళాశాలలో అధ్యాపకులను భర్తీ చేయడంతో అతిథి అధ్యాపకుల కొలువులకు ఎసరొచ్చింది. ఇప్పటికే మూడు నాలుగు నెలలకు ఒకసారి జీతాలు తీసుకుంటూ ఇబ్బందులు పడుతున్న వీరు ఉన్న ఉద్యోగం పోనుండడంతో కొత్త కష్టాలు ఎదుర్కోనున్నారు.

అతిథుల ఆవేదన ప్రభుత్వం ఆలకించేనా?

2014 నుండి ప్రభుత్వ కళాశాలల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న అతిథి అధ్యాపకుల పరిస్థితి కుడితిలో పడ్డ చందంగా తయారైంది. ప్రస్తుతం కొత్త లెక్చరర్ల నియామకంతో ఇబ్బందికరంగా మారింది. తమ సర్వీస్ ప్రాతిపదిక చేసుకుని ప్రభుత్వ కళాశాలలో అలాగే కొనసాగించాలని అతిథి అధ్యాపకులు వేడుకుంటున్నారు. వారి ఆవేదనను ప్రభుత్వం ఎలా అర్థం చేసుకుంటుందో చూడాలి.

ప్రభుత్వ నిర్ణయంపై ఎదురుచూపులు

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అతిథి అధ్యాపకులకు ఎంటిఎస్ ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టడంతో పాటు పలు సందర్భాల్లో అధ్యాపకులకు హామీ ఇచ్చింది. ప్రస్తుతం నూతన అధ్యాపకుల నియామకంతో వీరంతా రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వీరిని మరొకచోట సర్దుబాటు చేస్తారని ఆశాభావంతో ఉన్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందనేదానిపై అతిథి అధ్యాపకుల కుటుంబాల పరిస్థితి ఆధారపడి ఉంది.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

- డీఎస్పీ జీవన్‌రెడ్డి



ఉట్నూర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్నపోలీసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మద్యంతాగి వాహనాలు నడపొద్దని డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, కలెక్టర్ చౌక్‌లో నిర్వహించిన తనిఖీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోలీ పండుగను ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాల నడుమ ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. మద్యంతాగి వాహనాలునడిపి ప్రమాదలకు కారణం కావొద్దని, వారితో పాటు అమాయక ప్రజలు ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. డివిజన్ పరిధిలో 10 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ఈ తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్, ఎస్సై దేవేందర్, సిబ్బంది ఉన్నారు.

పలువురికి జరిమానా

ఉట్నూర్: హోలీ నేపథ్యంలో శుక్రవారం స్థానిక తెలంగాణచౌక్‌లో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యంమత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, ప్రమాదాల నివారణలో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడిన పలువురికి జరిమానాలు విధించారు.

ఎమ్మార్పీఎస్ అర్ధనగ్న ప్రదర్శన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న నిరసన కొనసాగుతోంది. శుక్రవారం పండుగను సైతం లెక్క చేయకుడా అర్ధనగ్న ప్రదర్శనతో తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి నోటిఫికేషన్‌లో వర్గీకరణ అమలు చేసి మాదిగలకు న్యాయం చేస్తానని నిండు శాసనసభలో సీఎం రేవంత్ మాటిచ్చి విస్మరించారన్నారు. ప్రతి ఉద్యోగంలో మాదిగలకు రిజర్వేషన్ల వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇందులో ఎమ్మార్పీఎస్ నామయకులు మనోజ్, శంకర్, స్వామి, కిరణ్ , అశోక్, రాజు, పోతరాజు శ్రీకాంత్, దేవన్న హన్మండ్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్



ఉట్నూర్ ఐటీడీఏ ఏపీఓ జాదవ్ వసంతరావు, హెల్త్ సూపర్‌వైజర్ జాదవ్ సంతోష్ తండ్రి జాదవ్ నారాయణ్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క భజంగారావు దంపతులు మండలంలోని శంకర్‌తండాలోని వారి స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జాదవ్ నారాయణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

జిల్లాలో ఘనంగా హోలీ వేడుకలు



నిర్మల్ టౌన్ : హోలీ వేడుకల్లో చిన్నారులు

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

జిల్లాలో కాముని దహనాన్ని పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగకు ఒక రోజు ముందు గురువారం రాత్రి కాముని దహనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా పలు కాలనీలో సాంప్రదాయ ప్రకారం పూజలు నిర్వహించి కోలాటాలు ఆడుతూ కాముని దహనాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

పట్టణంలో హోలీ సంబరం..

శుక్రవారం ఉదయం నుండే హోలీ సంబరాలు అంబరాన్ని అంటాయి. చిన్నాపెద్దా రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఉదయం నుంచి నాయుడువాడ, బంగల్‌పెట్, బుధవార్‌పేట్, బాగులవాడ, ప్రియదర్శిని నగర్, ఇంద్రనగర్, ఇలా పలు కాలనీలో యువకులు కేరింతలు కొడుతూ డీజే సౌండ్స్ మధ్య యువకులు, చిన్నారులు, పట్టణవాసులు నృత్యాలు చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గాంధీ చౌక్ నుంచి పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం ఒకరినొకరు రంగు పూసుకొని ర్యాలీగా వెళ్లారు. జిల్లా ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు పండగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు.

ఖానాపూర్ : ఖానాపూర్ మండలంతో పాటు పట్టణంలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో చిన్నారులు రంగులు చల్లుకుంటూ ఘనంగా సంబరాలు చేసుకున్నారు.

ఇంద్రవెల్లి : ఏజన్సీలో హోలీ పండగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాల్లో లంబాడీ సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం గ్రామ పెద్ద నాయక్ ఇంటివద్ద డప్పు వాయిద్యాలతో హోలీ పాటలతో దద్దరిల్లి పోయింది. లంబాడీ సాంప్రదాయాల ప్రకారం చనిపోయిన తమ పూర్వీకుల పేరిట భోగ్ భండార్ పూజలు నిర్వహించారు. అనంతరం తమ ఇంటికి వచ్చిన తాండా వాసులకు బహుమాన్నాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మహిళలు పురుషులు వేర్వేరుగా హోలీ రంగులను వేస్తూ సంబరంగా జరుపుకున్నారు.

సిరికొండ : మండల కేంద్రంతో పాటు మండలంలోని రాంపూర్ బి, పొన్న, సొంపల్లి, సుంకిడి, రాయిగూడ, పోచంపల్లి, ధర్మసాగర్ తదితర గ్రామాల్లో శుక్రవారం హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు రంగులను చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల బీఆర్ఎస్ నాయకులు నేరడిగొండలోని ఆయన నివాసంలో కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పెంటన్న, చందు, రోహిదాస్, సూర్యకాంత్, తులసి దాస్ పాల్గొన్నారు.

నిర్మల్ టౌన్ : హోలీ పండుగను పురస్కరించుకొని ఎస్టీయూ భవన్‌లో సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు రంగులు పూసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్. భూమన్న యాదవ్ మాట్లాడుతూ ఈ రంగోలి పండుగ అందరి జీవితాలలో ఆనందోత్సాహాలను నింపాలన్నారు. ఈ సంబరాల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శి ఎం.శ్రీనివాస్, హెడ్ క్వార్టర్ సెక్రటరీ బి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర బాధ్యులు చొక్కారావు, మండలాల బాధ్యులు అశోక్ కుమార్, ఈశ్వర్, నరసయ్య లక్ష్మీపతి, రాజన్న, విశ్వేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గిరి గ్రామాల్లో ప్రజలు శుక్రవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు పురుషులు, యువతి యువకులు చిన్న పెద్ద తేడా లేకుండా ఒక్కరినొక్కరు రంగులు చల్లుకుంటూ కేరింతలు వేశారు. ఇంట్లో పిండివంటలు చేసి దేవతకు నైవేద్యం అర్పించారు. ఆదివాసీ గూడెంలో ఆదివాసులు సంస్కృతి సాంప్రదాయం ప్రకారం పాటలు పడుతూ నృత్యాలు చేశారు. అదేవిధంగా లంబాడి తండాలో గిరిజనులు బంజారా సంస్కృతి సాంప్రదాయం ప్రకారం లెంగి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.

ఉట్నూర్ : హోలీ పండుగను మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మండలంలోని ప్రతి గ్రామంలో ఘనంగా ధులండి, హోలీ వేడుకలు ప్రజలు రంగుల పొడిని, రంగు నీళ్ళను ఒకరిపై ఒకరు జల్లుకుంటూ ఘనంగా జరుపుకున్నారు. అనంతరం తండా, గ్రామంలో ఇంటి ఆవరణంలో హోలీ ఆటను ఆడుకున్నారు.

నేరడిగొండ : మండలంలో హోలీ పండుగ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ నివాసంలో సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మహిళలు, నాయకులు, యువకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని రంగులు పూస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. శాంతియుత మార్గంలో పండుగను ఉత్సాహంగా జరుపుకోవాలన్నారు.



నార్నూర్ : కేరింతలు కొడుతున్న యువకులు



సిరికొండ : ఎమ్మెల్యేకు హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



ఖానాపూర్ : హోలీ వేడుకల్లో యువకులు

పట్టణంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

హోలీ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్క పోలీస్ అప్రమత్తతో విధులను నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లను పరిశీలించి, ప్రమాదాలు చోటు చేసుకోకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ఉండాలని తెలియజేశారు. హోలీ సందర్భంగా ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలని ఇతరులను అనుమతి లేకుండా రంగులు పూయడం లాంటివి నిర్వహించకూడదని తెలిపారు. వాహనదారులపై రంగులు వేయడం లాంటివి చేయకూడదని తెలిపారు. పట్టణంలోని వినాయక చౌక్, అబ్దుల్లా చౌక్, గాంధీచౌక్ అంబేద్కర్ చౌక్, శివాజీ చౌక్ ప్రాంతాలను పరిశీలించి ట్రాఫిక్ సమస్యపై తెలుసుకున్నారు. త్వరలోనే వాటికి అందరి సహకారంతో శాశ్వత పరిష్కారం అందించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి కదలికలను గమనించాలన్నారు. వాగులు చెరువులు నదులలో ఈతరానివారు వెళ్లకపోవడం శ్రేయస్కరమని తెలియజేశారు. కార్యక్రమంలో డిఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, పట్టణ సీఐలు సునీల్, శ్రీనివాస్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ



నవతెలంగాణ-నార్నూర్

గ్రామాన్ని అభివృద్ధి పరిచేందుకు స్వచ్ఛందంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ముందుకు రావడం అభినందనీయమని దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్ అన్నారు. మండలంలోని ఖంపూర్ గ్రామ అభివృద్ధికి ఎంపిక చేసి శుక్రవారం గ్రామంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ రూరల్ డెవలప్మెంట్ ఫండ్ కింద ప్రత్యేకంగా రైతులకు బోర్వెల్స్, విద్యుత్ కనెక్షన్, కంపోస్టు ఎరువుల ఉత్పత్తి, టీసీబీ ఫారం ఫండ్, సోలార్ లైట్, ఎరువుల ఉత్పత్తి, ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ విద్య, చెట్ల పెంపకం, విత్తనాలతో పాటు ఎలాంటి సమస్యలున్న పరిష్కరించేందుకు సంస్థ ప్రత్యేకంగా ముందుకు రావడం సంతోషకర విషయమన్నారు. వెనుకబడిన గ్రామాలకు ఈ ప్రాజెక్టు కింద బ్యాంక్ రూరల్ డెవలప్‌మెంట్ కింద 15 రోజుల క్రితం కలెక్టర్ రాజర్షి షా రాజులగూడలో నిర్వహించిన సభలో బ్యాంక్ యజమాన్యంతో మాట్లాడి వెనుకబడిన గ్రామాలకు ఎన్నుకోవాలని సూచించడం జరిగిందన్నారు. ముందుగా ఖంపూర్ గ్రామాన్ని ఎంపిక చేయడంతో దళిత హక్కుల పోరాట సమితి తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ సాయికుమార్, సీఆర్పీ బాలాజీ, గ్రామ పెద్దలు మారుతి, తానాజీ, గోవింద్, వెంకటి, సమాధాన్, జ్ఞానోబా, అంబాదాస్, మారుతి, సురేష్, విజయ్, గ్రామ యువకులు ఉన్నారు.

కేరింతల నడుమ హోలీ సంబరాలు

నవతెలంగాణ-తాంసి

తాంసి, భీంపూర్ మండలాల్లోని అన్ని గ్రామాలలో శుక్రవారం హోలీ సంబరాలను అంగరంగ వైభవంగా యువతీ యువకులు అందరూ కలిసి సంబరాలను నిర్వహించుకున్నారు. గురువారం రాత్రి అన్ని గ్రామాల్లో కామ దహన కార్యక్రమాన్ని జరుపుకున్నారు. తదానంతరం శుక్రవారం హోలీ పండుగను ఎంతో వైభవంగా చిన్న పెద్ద తేడా లేకుండా రంగులను చల్లుకుంటూ హోలీ పండుగను నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో

ఆదిలాబాద్ టౌన్ : బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ నివాసం వద్ద హెూలీ వేడుకలు జరిగాయి. నాయకులు, అభిమానులు ఆయన్ను కలిసి రంగులను చల్లుతూ హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. బాపురావ్ కుటుంబ సభ్యులతో కలిసి హెూలీ ఆడి జిల్లా ప్రజలకు పండుగల శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన క్యాంటీన్‌కు ఏడాది పూర్తి

- విజయవంతంగా కొనసాగిందన్న ఐటీడీఏ పీఓ

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజనులకు తక్కువ ధరకే మంచి నాణ్యమైన భోజనం అందించాలని ఐటీడీఏ తరపున ఉట్నూర్ మండల కేంద్రంలో గిరిజన భవన్‌లో గిరిజన క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. గతేడాది మార్చి 15న రాష్ట్ర మంత్రి సీతక్క, కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ కుష్బూగుప్తా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి ప్రారంభించారు. అప్పటి నుంచి గిరిజన క్యాంటీన్‌లో ప్లేట్ మీల్స్ కేవలం రూ.5లకే మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు అందిస్తున్నారు. ఈ క్యాంటీన్ ఏర్పాటు చేయడంతో కొలాం గిరిజనులకు ఉపాధి లభించించడంతో పాటు చుట్టు ప్రక్కల గల గ్రామాల నుండి వివిధ రకాల పనుల కోసం వచ్చే ప్రజలకు రూ.5కే నాణ్యమైన పౌష్టికాహారం లభిస్తుంది. గిరిజన క్యాంటీన్ ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు 77,690 మంది భోజనం చేశారని ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా తెలిపారు. ఐదుగురు సభ్యులతో జేఎల్‌జీ ఏర్పాటు చేసి దీన్ని కొనసాగిస్తున్నామని వివరించారు. ప్రతి రోజు నాణ్యతతో కూడిన భోజనం గిరిజనులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఏడాది కాలంగా విజయవంతంగా క్యాంటిన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆదివాసుల అభ్యున్నతికి ఐటీడీఏ ద్వారా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా పీఓ అన్నారు.



ఎమ్మెల్యేపై సస్పెన్షన్ వేటు వేయడం సరికాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో నిలదీసినందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయడం సరికాదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్ అన్నారు. సస్పెన్షన్‌ను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, చిత్రపటాలను దహనం చేసి కాంగ్రెస్, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజల పక్షన మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెండ్ చేయడం సరికాదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్ అన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. పొలాలు ఎండి పోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రుణమాఫీ, రైతుబంధు రాక రైతులు కష్టాలు ఎదుర్కొంటున్న వట్టించుకోకపోవడంతో నిరాశకు లోనవుతున్నారన్నారు. గవర్నర్ ప్రసంగంలో రుణమాఫీ అయిందని చెప్పించారన్నారు. షాది ముబారక్, కల్యాణ లక్ష్మీ పథకంలో రూ.లక్ష 50వేలు, తులం బంగారం ఇస్తామని దాని ఉసే లేదన్నారు. సస్పెన్షన్లతో బీఆర్ఎస్ గోంతును నొక్కలేరని, ప్రజల కోసం పోరాడుతునే ఉంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లద్, నారాయణ, గోవర్ధన్, ధమ్మపాల్ పాల్గొన్నారు.



ఖానాపూర్ : సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసే సమయంలో నాయకులకు పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపులో భాగంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల, పట్టణ అధ్యక్షులు రాజ గంగన్న, గౌరికర్ రాజు మాట్లాడుతూ ప్రజల తరపున శాసనసభలో బీఆర్ఎస్ ఉంటే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనే భయంతో పార్టీ గొంతు నొక్కే ప్రయత్నం కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అప్రజాస్వామిక వైఖరి, సీఎం రేవంత్ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అనంతరం తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలని ప్రజలు గమనిస్తున్నారని రాష్ట్రంలో ప్రజాపాలన పేరిట నియంత పాలన చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణంలో ఘనంగా హోలీ సంబరాలు



కలెక్టర్‌కు రంగు పూస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రంగుల పండుగ హోలీలో ప్రతి ఒక్కరు సహజసిద్ధమైన రంగులనే వాడాలని కలెక్టర్ రాజర్షి షా కోరారు. శుక్రవారం హెూలీ పర్వదినాన్ని పురస్కరించుకొని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల శంకర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, బీజేపీ నాయకులు కలెక్టర్ ను కలిసి రంగులను పుస్తు హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ తో పాటు ఎస్పీ అఖిల్ మహాజన్ ను నాయకులు, ప్రజలు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన హోలీ వేడుకల్లో కలెక్టర్ రాజర్షి షా, యాపల్ గూడ రెండవ బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్, ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. ఒకరినొకరు రంగులు పూస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సినిమా పాటలపై నత్యాలు చేస్తూ కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ బ్యాండ్ మేళాలు కొడుతూ ఉద్యోగులను ఉత్సహపరిచారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో హోలీ వేడుకలు అంబరాన్నింటాయి. పోలీసులు ఏఆర్ హెడ్క్వార్టర్ నుంచి డీజే పాటల నడుమ నృత్యాలు చేస్తూ ర్యాలీగా క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. ఇక్కడ ఎస్పీకి రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ నృత్యాలు చేస్తూ వారితో కలిసి పోయారు. కార్యక్రమంలో డీఎస్పీలు జీవన్ రెడ్డి, శ్రీనివాస్, సీఐలు, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

నృత్యాలు చేసిన ఎమ్మెల్యే పాయల్

అందరి మంచి కోరుకునే పండుగలు హిందు పండుగలను ఇటీవల జరిపిన సర్వేలో తెలిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం పండుగను పురస్కరించుకొని బీజేపీ నాయకులు, అభిమానులు ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రంగులను పుస్తు పండగను జరుపుకున్నారు. ఎమ్మెల్యేతో సెల్ఫీలు దిగారు. అనంతరం ఎమ్మెల్యే అభిమానులతోకలిసి నృత్యాలు చేస్తూ వారిని ఉత్సహపరిచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మనంద్, మయూర్ చంద్ర, చందన్, ఆకుల ప్రవీణ్, రఘుపతి ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో

మరో పక్క బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోనూ హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, నారాయణ, దమ్మపాల్, అడన తిరుపతి, కోండ గణేష్ పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో..

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీ మాధవ నిలయంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతిలో ఒకరిపై ఒకరు ఎలాంటి రసాయనాలు లేని ప్రకతి సిద్ధమైన రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపి క్రిష్ణ, నాయకులు, బచ్చు నారాయణ, గోమంత్ రెడ్డి, బత్తుల గంగాధర్, మెస్రం రాజ్ కుమార్, ఆత్రం సతీష్, వాసుదేవ్ ముండే, చంద్రశేఖర్ ముండే, గోపాల్, సాగర్, శ్రీనివాస్, జైస్వాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వాల్మీకి నగర్‌లో..

జిల్లా కేంద్రంలోని వాల్మీకినగర్‌లో శుక్రవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు పెద్దలు మహిళలు అందరూ కోలాళంగా సంబరాలు జరుపుకున్నారు. 12 సంవత్సరాలుగా గణేష్ ఉత్స, శివరాత్రి సంబరాలతో పాటుఉత్సవాల్ని కాలనీవాసులు కలిసి మెలిసి అందరూ సంతోషంగా జరుపుకొంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు జే.నారాయణ, అశోక్ గౌడ్ సాంబయ్య అనిల్, అరవింద్ పేర్కొన్నారు.







నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | మార్చి 15, 2025 | www.navatelangana.com

భక్తిశ్రద్ధలతో కామదహనం

నవతెలంగాణ-చింతలమానపల్లి



వసంత కాలంలో వచ్చే ఈ రంగుల పండుగ(హోలీ)ను మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో కామ దహనం చేశారు. మండల కేంద్రంలో చత్రపతి శివాజీ చౌరస్తా వద్ద శుక్రవారం హోలిక దహనం నిర్వహించారు. వాటి చుట్టూ తిరుగుతూ, ప్రార్థనలు చేశారు. చెడును తొలగించి మంచిని ప్రసాదించాలని వేడుకున్నారు. వీధులలో చేరి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగ ఘనంగా జరుపుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

రంగులమయమైన గల్లీలు

నవతెలంగాణ-కెరమెరి



హోలీ పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని గల్లీలు రంగుల మాయంగా మారాయి. రకరకాల రంగులు చల్లుకుంటూ పండుగ ఘనంగా జరిపారు. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా సంతోషకరమైన వాతావరణంలో రంగులు ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. చిన్న పిల్లలు రంగు తుపాకీలతో తమ తోటి వారిపై రంగు నీళ్ళను పిచికారీ చేస్తూ కేరింతలు వేశారు.

జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మాజీమంత్రి జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి బహిష్కరించడాన్ని తప్పుబడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీంద్ర అధ్యక్షతన మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. అంబేద్కర్ చౌక్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి కాంగ్రెస్, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేక తమ పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యతో వ్యవహరిస్తుందని ఆరోపించారు. రానున్న రోజుల్లో ప్రజలే అధికార పార్టీకి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీల నోరునొక్కె ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఈ విధానం సరైంది కాదని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు అధికార పార్టీపై ఒత్తిడి తీసుకువస్తామని తాము ఎప్పుడు ప్రజల పక్షాన ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్లు అలి బిన్ అహ్మద్, సంజీవ్ కుమార్, పెంటు, మాజీ జెడ్పీటీసీ అజయ్ కుమార్, బీఆర్ఎస్ రెబ్బెన మండల అధ్యక్షులు పోటు శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్లు వినోద్, భీమేష్, తుకారాం, మాజీ ఎంపీటీసీ మల్లేష్, నాయకులు నిసార్, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో హోలీ వేడుకలు

నవతెలంగాణ-తిర్యాణి

హోలీ పండుగను పోలీసులు ఘనంగా నిర్వహించారు. ఎస్సై ఎంబడి శ్రీకాంత్ సిబ్బందితో కలిసి వేడుకలను జరుపుకున్నారు. అలాగే మండలంలోని యువతీయువకులు ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ ప్రతి ఒక్కరి జీవితం రంగుల మయంగా ఉండాలని సంతోషంగా సంబరాలు చేసుకున్నారు.



భానుడి భగభగ..ప్రజలు విలవిల

- ప్రారంభంలోనే మండుతున్న ఎండలు
- బయటకు రావడానికి జంకుతున్న జనాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రెండు రోజులుగా భానుడు విశ్వరూపం చూపడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ప్రజలు పశుపక్ష్యాదులు కూడా బయటకు వెళ్ళలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. మార్చి రెండో వారంలోనే ఎండలు పెరగడంతో పగలు రోడ్లపైకి రావడానికి జనాలు జంకుతున్నారు. రోజురోజుకు ఎండలు పెరగడంతో ఏజెన్సీ ప్రాంత గిరిజనులు నీటికి విలవల లాడుతున్నారు. ఎండలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రజల కష్టాల పైన ప్రత్యేక కథనం

గతవారం రోజులుగా పెరిగిన ఎండలు

గడిచిన వారంలో బుధవారం 38 డిగ్రీలుగా నమోదైన ఉష్ణోగ్రత, గురువారం 38.5, శుక్రవారం 40.4 డిగ్రీలుగా నమోదు కాగా, శనివారం, ఆదివారం కూడా 40 డిగ్రీలు దాటి అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈవిధంగా ప్రతి రోజు ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. దీంతో జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ఇతర మండలాల ప్రజల తాకిడి వేసవికాలం ప్రారంభంలోనే తగ్గడంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఎలాగా



ఉంటుందని అటు వ్యాపారస్తులు ఇటు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న డాక్టర్లు

జిల్లాలో పెరిగిన ఎండల నేపథ్యంలో ఏదైనా పని మీద బయటకు వెళ్ళే వారు తప్పనిసరిగా వెంట నీటిని తీసుకవేల్లాలని సూచిస్తున్నారు. అలాగే ఎండలో పనిచేసే వారు అదే పనిగా మద్యాహ్నం అంతా పనిచేయకుండా కొద్దిసేపు నీడలో విశ్రాంతి తీసుకోవాలి. ఎండకు వెళ్తున్నప్పుడు తప్పనిసరిగా తలకు తువాల చుట్టుకోవాలి. ఉపాదిహామి కూలీలు పొద్దున్న పూట మాత్రమే పనిచేసేలా చూసుకోవాలి.

వాతావరణంలో మార్పులతో పరేషాన్

రాత్రిపూట చల్లగా మారుతున్న వాతావరణం మధ్యాహ్నం కల్లా బీభత్సంగా తయారవుతుంది. ఒకేసారి ఎండల తీవ్రత పెరిగి ఉక్కిరిబిక్కిరి అవుతున్నఆరు. కూలర్లు, ఫ్యాన్లు కూడా పని చేయడం లేదు. దీనితో ప్రజలు వాతావరణానికి అలవాటు కాలేక ఇబ్బందులు పడడంతో పాటు అనేకమంది రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికే వాతావరణంలో మార్పులు పట్ల వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. వచ్చే రెండు మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

ప్రారంభంలోనే ఎండలు పెరిగాయి

దేవరావు, ధనోరా

గత సంవత్సరంతో పోలిస్తే మార్చి ప్రారంభంలోనే ఎండలు పెరిగి ఇబ్బంది పెడుతున్నాయి. ఇంకా మూడు నెలల వేసవికాలం ముందు ఉండటంతో ఇప్పటికే ప్రజల్లో భయం పట్టుకుంది.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో పండగ ఆనందానికి దూరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలంతా సంతోషంతో జరుపుకుంటున్న హోలీ పండుగ రోజు కూడా కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా వారిని పస్తులతో ఉంచుతారా..? అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ ప్రశ్నించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న వర్కర్లకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం మూడో రోజు శిబిరంకు వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7 నెలల వేతనాలు రాకుంటే కార్మికులు వారి కుటుంబాలు ఎలా బ్రతకాలన్నారు. హోలీ పండుగ రోజు కూడా కార్మికులు సమ్మెలో ఉన్నారంటే జిల్లా అధికారులు, రాష్ట ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ లను పరిష్కరించాలని, కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలనీ ఇఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు చెల్లించాలని, ఐదు



సంవత్సరాల సర్వీసు ఉన్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. పని చేస్తున్న కార్మిక కుటుంబాల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మేస్రం సీతారాం, జిల్లా నాయకులు సధాశివ్, ఇందు రమేష్, పతుబాయి, రాంబాయి మాన్కు వసంత్ రావ్, జంగూ, దివ్యా, జంగుబాయి, కన్నుబాయి, మామిడి లక్ష్మీ, క్రిష్ణ పాల్గొన్నారు.

నాగులవాయిలో వరి గడ్డి కుప్ప దగ్ధం

- పోలీస్ చొరవతో గ్రామానికి తప్పిన పెను ప్రమాదం



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని నాగులవాయి గ్రామంలో శుక్రవారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. నాగులవాయి గ్రామానికి చెందిన వశాక విజయ్ చెందిన వరిగడ్డి కుప్ప వద్ద గ్రామస్తులు పొయ్యిలోని నిప్పులు పడేయడంతో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగి వశాఖ విజయ్ వరి గడ్డి కుప్ప దగ్ధమైంది. గ్రామస్తులు గమనించి బిందెలతో అర్పించే ప్రయత్నం చేసిన ఆరకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్, కానిస్టేబుల్ వెంకన్న సందర్శించి గ్రామస్తులు సహకారంతో నీళ్ల బిందెలతో అర్పించే ప్రయత్నం చేశారు. ఎంతకీ మంటలు అదుపులోకి రాకపోవడంతో కాగజ్‌నగర్ అగ్నిమాపక కేంద్రానికి ఎస్సై ప్రవీణ్ కుమార్ సమాచారం అందించారు. హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది నాగులవాయి గ్రామాన్ని చేరుకుంది. ఫైర్ ఇంజన్‌తో మంటలు అర్పించారు. దీంతో నాగులవాయి గ్రామానికి పెను ప్రమాదం తప్పింది. బెజ్జూర్ పోలీసులు చేసిన కృషిని పలువురు అభినందించారు.

జిల్లాలో ఘనంగా హోలీ వేడుకలు

- చిన్నాపెద్ద తేడా లేకుండా పండగ సంబరాలు
- సహజ రంగులకు అధిక ప్రాధాన్యత
- వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు



ఆసిఫాబాద్ : దప్పు కొడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హోలీ పండుగను జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో చిన్న పెద్ద తేడా లేకుండా ఉత్సవాల్లో పాల్గొన్నారు. గురువారం సంప్రదాయం ప్రకారం కామదహనం జరిపి మరుసటి రోజు హోలీ వేడుకలు జరుపుకున్నారు.

చిన్న పెద్ద తేడాలేకుండా సంబరాలు

చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు హోలీ సంబరాల్లో మునిగిపోయారు. ఉదయం నుండే రోడ్లపైకి వచ్చి రంగులు చల్లుకున్నారు. పట్టణంలోని రావులవాడ, టీఆర్‌నగర్, సందీప్‌నగర్ ప్రాంతాల్లో చిన్నా పిల్లలు, మహిళలు, యువకులు తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు.

సహజ రంగులకు అధిక ప్రాధాన్యత

జిల్లాలో నిర్వహించిన హోలీ వేడుకల్లో ప్రజలు ఎక్కువగా సహజ రంగులకు ప్రాధాన్యత ఇచ్చారు. పలు సామాజిక మాధ్యమంలో సహజరంగులపై ప్రచారాలు జరుగుతుండడంతో అవగాహన పెరిగిన వాటిపై ఎక్కువ మక్కువ చూపినట్లు తెలుస్తోంది.

వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

జిల్లా కేంద్రంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, డీఎఫ్ఓ నీరజ్ కుమార్, ఏఎస్పీ ప్రభాకర్ రావు, ఎస్‌డీపీఓ చిత్తరంజన్, స్థానిక సీఐ రవీందర్ హోలీలో పాల్గొనగా, జిల్లాలోని అధికారులు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో అలరించిన ప్రముఖులు

హోలీ పండగలో ప్రముఖులు కుటుంబ సభ్యులతో పాల్గొని అలరించారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, కుటుంబ సభ్యులతో వేడుకలు నిర్వహించుకోగా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, తన సతీమణి ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తాతో వేడుకల్లో పాల్గొన్నారు.

డీపీఓ కార్యాలయంలో

జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐలు రాణా ప్రతాప్, రవీందర్, బుద్దె స్వామి, రమేష్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా మతాలకతీతంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ ముత్యం రమేష్ అధ్వర్యంలో హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సంబరాల్లో కౌటాల, చింతలమానెపల్లి ఎస్సైలు ఎస్.మధుకర్, నరేష్ ఉన్నారు.

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం హోలీ సంబరాలను ఉదయం నుండే చిన్నాపెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో ఉదయం నుండే ప్రతి ఒక్కరు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

బెజ్జూర్ : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో హోలీ సంబరాలు అంబరాన్ని అంటాయి. శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా ఎక్కడ చూసినా పిల్లలు యువకులు కేరింతలు ఆటపాటలతో సందడి చేశారు. రంగులు చల్లుకుంటూ పిల్లలు, యువకులు, విద్యార్థులు సందడి చేశారు. గ్రామాల్లో కామదాహం నిర్వహించిన అనంతరం డప్పుల వాయిద్యాలతో రంగులు చేరుకున్నారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ యువకులతో హోలీ జరుపుకున్నారు.

పెంచికల్‌పేట్ : హోలీ పండుగ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో వేడుకలను యువకులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ పండుగను జరుపుకున్నారు. గ్రామాల్లో కామదహనాలు నిర్వహించి పండుగను ప్రశాంతంగా జరుపుకున్నారు.



బెజ్జూర్ : హోలీ ఆడుతున్న చిన్నారులు



ఆసిఫాబాద్ : చిన్నారికి రంగు పూస్తున్న కలెక్టర్



బెజ్జూర్ : యువకులతో కలిసి హోలీ ఆడుతున్న పోలీసులు



ఆసిఫాబాద్ : సిబ్బందితో కలిసి నృత్యాలు చేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్



పెంచికల్‌పేట్ : హోలీ వేడుకల్లో యువకులు



ఆసిఫాబాద్ : కుటుంబ సభ్యులతో కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఎఫ్ఓ



కౌటాల : కేరింతలు కొడుతున్న యువకులు



ఆసిఫాబాద్ : హోలీ వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలెక్టర్, సతీ, అదనపు కలెక్టర్లు

నిలువ నీడ కరువు

- బస్ షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు
- ఒంటికి, రెంటికి తప్పని కష్టాలు
- పట్టించుకోని పాలకులు



నవతెలంగాణ-కెరమెరి

ఎన్నో ఏండ్లుగా మండల కేంద్రంలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజలు పాలకులను అధికారులను కలిసి విన్నవించిన ఎలాంటి ఫలితం లేకుండా పోతుంది. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన మండల కేంద్రంలో బస్సు షెల్టర్ ఏర్పాటు కల నెరవేరడం లేదు. దీంతో ఆర్టీసీ ప్రయాణికులకు నిలువ నీడ కరువు అవుతుంది. గ్రామాలకు కెరమెరి మండల కేంద్రం జంక్షన్‌గా ఉంది. కానీ ఇక్కడ బస్సు షెల్టర్ లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం పడిగాపుల కాస్తున్నారు. మండలంలోని సుమారు 52 గ్రామాల ప్రజలకు ఉమ్మడి జిల్లాలోని అనేక గ్రామలతో అనుబంధం ఉంది. ఉట్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఆదిలాబాద్, నిర్మల్, ఇచ్చోడ, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి, జన్నారంతో పాటు అనేక గ్రామాలకు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఈ గ్రామాలకు వెళ్లేందుకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాక తప్పదు. మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. బస్‌షెల్టర్ లేకపోవడంతో ఇక్కడున్న చెట్లు షాపులు, కిరాణాషాపుల ఎదుట ప్రయాణికులు నిలబడి ఉండాల్సి వస్తుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ఉద్యోగులు ప్రధాన రహదారికి ఇరువైపులా నిరీక్షించాల్సి పరిస్థితి నెలకొంది. కొద్దిపాటి వర్షం కురిసినా తలదాచుకునేందుకు చోటులేక లగేజీలు, పిల్లాపాపలతో తడవాల్సి వస్తోంది.కొన్ని సందర్భాల్లో దుకాణాల యజమానులు ప్రయాణికులను ఈసడించుకున్న సందర్భాలు అనేకం. నిత్యం వందలాది మంది ప్రయాణికులతో వివిధ పనుల మీద ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారితో మండల కేంద్రం కిటకిటలాడుతుంది.

ఒంటికి, రెంటికి ఇబ్బందులే..

నిత్యం వందలాది మంది ప్రయాణికులతో వివిధ పనుల మీద ప్రభు త్వ కార్యాలయాలకు వచ్చే వారితో మండల కేంద్రం రద్దీగా ఉంటుంది. ఆర్టీసీ బస్సులో అసిఫాబాద్ నుండి ఆదిలాబాద్ వెళ్లే ప్రయాణికులు ఒంటికి, రెంటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురుషులు ఎక్కడో ఓ చోటు దొరికొతే తమ అవసరాలు తీర్చుకుంటున్న మహిళల బాధలు వర్ణనాతీతం. ఆసిఫాబాద్ నుండి ఆదిలాబాద్ వెళ్లే మార్గంలో కెరమెరి, జైనూర్ మండల కేంద్రాలతో పాటు ఏ స్టాప్ వద్ద కూడా మరుగుదొడ్లు లేవు. 75కిమీ దూరంలో ఉన్న ఉట్నూర్ డిపో వచ్చే వరకు మహిళలు అవస్థలు పడక తప్పడం లేదు. మళ్ళీ ఉట్నూర్ నుండి గుడి హత్నూర్ వరకు మరుగుదొడ్లు కానరావు. దీంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు, బస్సు దిగిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | మార్చి 15, 2025 | www.navatelangana.com

సరస్వతీ పుత్రుడు లెక్కల శ్రావణ్

- గ్రూప్-3లో స్టేట్ 34వ ర్యాంక్
- నాలుగు ఉద్యోగాలకు ఎంపిక



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గుడిపేటకు చెందిన లెక్కల లింగయ్య, కళావతి దంపతుల కుమారుడు శ్రావణ్ నాలుగు ప్రభుత్వ కొలువులు సాధించి సరస్వతి పుత్రునిగా నిలిచాడు. శుక్రవారం వెలువడిన గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 34వ ర్యాంక్ సాధించి మరో సారి తన సత్తా చాటాడు. మూడు రోజుల క్రితం వెలువడిన గ్రూప్-2లో స్టేట్ లెవల్ 97వ ర్యాంక్ సాధించాడు. గతంలో గ్రూప్-4, పంచాయతీ కార్యదర్శి జిల్లా మొదటి ర్యాంక్ సాధించాడు. కొద్ది రోజులు ఉద్యోగం చేసి గ్రూప్స్ కోసం రాజీనామా చేసి పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నం చేసి విజయం సాధించాడు.

జీవితంపై విరక్తితో సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య

నవతెలంగాణ-మంచిర్యాల

జీవితంపై విరక్తితో సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న చెందిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక ఏఎస్ఐ దివాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల కు చెందిన వీర్ల శ్రీధర్(43) సింగరేణి ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరుచు భార్యతో గొడవ పడేవాడు. పిల్లలు పెద్ద అవుతున్నారు తాగుడు మానేయాలని భార్య శ్రీకరి మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఎప్పట్లాగే మద్యం సేవించి రూంలోకి వెళ్లి డోర్ పెట్టుకున్నాడు. కొంత సమయం తర్వాత భార్య శ్రీకరీ ఎంత పిలిచినా పలకక పోవడంతో చుట్టూ పక్కల వారిని పిలిచి డోర్ పగలగొట్టి చూడగా అప్పటికే ఫ్యానుకు లుంగీలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీధర్‌కు ఇద్దరు కుమారులు రోహన్, వచ్చన్‌లు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

యథేచ్ఛగా అక్రమ కలప రవాణా

- స్థానికంగా ఉండని అధికారులు

నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలో అక్రమణ కలప రవాణా యథేచ్ఛగా సాగుతోంది. చర్యలు తీసు కోవాల్సిన అటవీ శాఖ అధికారులు మమూలుగా తీసుకుని వదిలేస్తున్నారని ఆరోపణలున్నాయి. గతంలో దొంగచాటున రాత్రి సమయంలో టేకు దుంగలు ఆటోలు, వ్యాన్లలో తరలించేవారు. ఇప్పుడు ఏకంగా పెద్ద వాహనాల్లో ప్రధాన రహదారిపై నుంచే అక్రమంగా తర లిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తిర్యాణి, మాదారం అటవీ ప్రాంతం నుంచి తాండూరు మీదుగా రహ దారి మార్గంలో మంచిర్యాల జిల్లాకు అక్రమంగా కలప తరలిస్తున్నారు. ఆ రహదారిపై పోలీసులు, అటవీ శాఖ అధికారులు తనిఖీ చేయకపోవడంతో కలప అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోతుంది.

కొండ ప్రాంతాల నుంచి తరలింపు

తిర్యాణి, మాదారం గోలేటి ప్రాంతాలలో విస్తారంగా దట్టమైన అడవులు ఉన్నాయి. ఆయా కొండ ప్రాంతాల్లో విలువైన టేకు, జిట్రేగి కలప వృక్షాలు ఉన్నాయి. అటవీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో స్మగ్లర్లు వృక్షాలను నరికి కలుపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. అటవీ ప్రాంతాల నుంచి కలప అక్ర మార్కులు రాత్రివేళ కూలీలతో టేకు దుంగలను తలపై మోపిస్తూ తాండూరు, ఐబీ ఏరియా, కిష్టంపేట, మాదారం గ్రామాలకు తరలిస్తున్నారు. పోలీ సులు, అటవీ శాఖ అధికారులకు కలప స్మగ్లర్లు ముందుగానే మామూళ్లు ఇస్తున్నారని, అందుకే తాండూరు మండలంలోని గ్రామాల్లో తనిఖీలు చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అక్కడ మరికొందరు ప్రయివేట్ టింబర్ డిపో వ్యాపారు కలపను కొనుగోలు చేసి పాత రశీదులను అడ్డు పెట్టుకుని జీరో కర్ర అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. మాదారం రేంజ్‌లోని అబ్బాపూర్, నర్సాపూర్, హాసన్‌మాడ గిరిజన గ్రామాల నుంచి టేకు దుంగల రవాణా సాగుతోంది. రాత్రి వేళల్లో నెంబర్ లేని ఆటో ట్రాలీ వాహనాల్లో తాండూర్ ఐబీ మండల కేంద్రానికి చేరవేస్తున్నారు. స్థానిక టింబర్ డిపో వ్యాపారులు అనుమతి లేని కర్రను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. అన్నీ తెలిసినా అటవీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తాండూరు నుంచి మంచిర్యాల వరకు నాలుగు వరసల రహదారి మీదుగా కలప రవాణా జరుగుతోంది. ఫోర్ వే రహదారి నిర్మాణంలో భాగంగా గ్రామాల వద్ద అండర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టడంతో గ్రామాల కలయిక లేకుండా పోలీసుల కన్నుగప్పి స్మగ్లర్లు కలప రవాణా చేస్తున్నారు.



బెల్లంపెల్లిలో అక్రమంగా తరలిస్తున్న కలప వాహనాన్ని పట్టుకున్న అటవీ అధికారులు (ఫైల్)



అధికారులు స్థానికంగా లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న అటవీ శాఖ క్వార్టర్లు

స్థానికంగా ఉండని అటవీ అధికారులు

మండల పరిధిలో తాండూర్, మాదారం సెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ అటవీ శాఖ అధికారుల కోసం క్వార్టర్లు నిర్మించినప్పటికీ అధికారులు స్థానికంగా నివాసం ఉండటం లేదు. మంచిర్యాల, బెల్లంపల్లి, వరంగల్ నుంచి రాకపోకలు సాగిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. అటవీ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయకపోవడంతో స్థానికులు ఎడ్ల బండ్ల సహాయంతో అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విలువైన వృక్ష సంపద అంతరించిపోతోంది. మామూళ్ల మత్తులో అటవీ శాఖ అధికారులు విధులను విస్మరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడ ఇంటి నిర్మాణాలు జరిగిన అటవీ అధికారులకు మామూలు ఇచ్చుకోవాల్సిందేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అటవీ సంపద కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంజేపీ బ్యాక్‌లాగ్ సెట్‌ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి ఎంజేపీ బ్యాక్ లాగ్ సెట్ నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థినీ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా గాని లేదా సమీప మీ సేవ కేంద్రాల ద్వారా గాని దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 31 చివరి తేదీ కాగా ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ధరఖాస్తు చేసుకునే విద్యార్థులు బోనఫైడ్, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటో, సంతకం, ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. చివరి రోజు వరకు నిరీక్షించకుండా తల్లిదండ్రులు తక్షణమే స్పందించి సకాలంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. ప్రవేశ పరీక్షకి సంబంధించిన హాల్ టికెట్లను ఏప్రిల్ 15వ తేదీ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని మరింత సమాచారం కొరకు వెబ్‌సైట్ ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్‌లో లేదా 040-23328266 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా అనభేరి ప్రభాకర్ 77వ వర్ధంతి



నవతెలంగాణ-మంచిర్యాల

స్వాతంత్ర సమరయోధుడు అనభేరి ప్రభాకర్‌రావు 77వ వర్ధంతి సందర్భంగా సామాజిక కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అనభేరి ప్రభాకర్‌రావు తెలంగాణ ఉద్యమ చరిత్రలో తొలి అమరుడని, సాయుధ పోరాటంలో నిజాం పాలన నుంచి విముక్తి కావాలని అలుపెరగని పోరాటం చేసిన యోధుడని అన్నారు. పీడిత ప్రజల పక్షాన నిలబడి వెట్టి చాకిరి విముక్తికి కృషి చేశాడన్నారు. నిజాం, రజాకార్ల అరాచక పాలన నుంచి తెలంగాణ ప్రజలను విముక్తి కోసం అమరుడయ్యాడని, నిజాం రజాకర్ల ఎదురుకాల్పుల్లో కరీంనగర్ జిల్లాలో అమరత్వం పొందిన అణబేరి ప్రభాకర్‌రావు పట్ల ప్రభుత్వాలు సరైన రీతిలో గౌరవించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అనబెరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని ట్యాంకుబండుపై ఏర్పాటు చేస్తూ అనభేరి పేరున ఒక యూనివర్సిటీ స్థాపించి పాఠ్యపుస్తకాల్లో అతని చరిత్రలను ప్రచురించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త శ్రీమన్నారాయణ, కల్వల సుధాకర్‌రావు, కనుకుంట్ల మల్లన్న, రాధే శ్యామ్, రఘుపతిరావు, వీర్ల మల్లికార్జునరావు, వైకుంఠం, రాపోల్ జనార్దన్‌రావు, కొండు వెంకటేశ్వరరావు, పడాల రమేష్‌రావు, భీమేశ్వరరావు, శివ శేఖర్ రావు, ఒడ్నాల సత్యనారాయణ రావు పాల్గొన్నారు .

జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అమానుషం



నవతెలంగాణ-మంచిర్యాల

కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ కేటీఆర్ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఐబీ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ నుంచి ఆయనను సస్పెండ్ చేయడమంటే ప్రశ్నించే గొంతుకను నొక్కడమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు, రైతులు, వివిధ వర్గాల సమస్యలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసినందుకు సభ నుంచి సస్పెండ్ చేయడం అనైతికమన్నారు. సస్పెన్షన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పట్ల కనీస గౌరవ మర్యాదలు లేకుండా సీఎం రేవంత్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. సీఎం రేవంత్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నిరసనలో పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, గోగుల రవీందర్‌రెడ్డి, ఎర్రం తిరుపతి, పడాల రవీందర్, తోట తిరుపతి, కర్ర శంకర్, గట్టయ్య, కార్ల తిరుపతి, వొడ్నాల రవీందర్, కందుల ప్రశాంత్, జాడి భానుచందర్, కాటంరాజు, అమృత రాజ్ పాల్గొన్నారు.

జైపూర్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు, కాంగ్రెస్ పరిపాలన వైఫల్యాలు ఎత్తిచూపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం అమానుషమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సస్పెండ్‌కు నిరసనగా భీమారం, జైపూర్ మండల కేంద్రాల్లో 63వ నెంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం కాంగ్రెస్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కలగూర రాజకుమార్ మాట్లాడుతూ కేటీఆర్ పిలుపు, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నూర్ నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ అప్రజాస్వామిక వైఖరి, రేవంత్‌రెడ్డి నియంతృత్వ పోకడలను వ్యతికిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవరగాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నించడంలో ఎలాంటి తప్పులేదన్నారు. హామీలు నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ప్రజల పక్షాన గొంతెత్తితే నొక్కేయడం హేయనీమన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, ఆయన సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సీనియర్ నాయకులు మాజీ దంపూర్ సర్పంచ్ దాసరి మధునయ్య, మద్దికల్ మాజీ ఎంపీటీసీ అత్కూరి రాము, విశాల్, సూరం లచ్చన్న, దుర్గం లాజర్, భుక్య రాజు, మణిదీపక్ దాసరి, బబ్లు, శ్రీకాంత్‌గౌడ్, మహిళ నాయకురాలు కళావతి, భీమారం గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రణీత్‌గౌడ్, నరహరి, సురేష్, గోపాల్ ముదిరాజ్ పాల్గొన్నారు.



సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు సోహెల్ షా



నవతెలంగాణ-జన్నారం

హైదరాబాదులోని ఉస్మానియా క్యాంపస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్వీ నాయకుడు కందుల మధుపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు సోహెల్ షా అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం హోదాలో వ్యక్తిని పిచ్చికుక్కతో పోలుస్తూ రేబిస్ ఇంజక్షన్ ఇస్తామనడం సరికాదన్నారు. వెంటనే బీఆర్ఎస్వీ నాయకుడి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు సాయి నాయక్, మండల ఇన్‌చార్జి తరుణ్, రాజేష్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలో హోలీ సంబరాలు అంబరాన్ని అంటాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే పట్టణ పుర వీధుల్లో యువత పెద్ద ఎత్తున బయటకు వచ్చి హోలీ సంబరాలు చేసుకున్నారు. వాకర్స్ క్లబ్ అధ్వర్యంలో పట్టణంలోని బాయ్స్ హై స్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో వాకర్స్ సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ డీజే పాటలతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఆదిత్య ఎంక్లేవ్, హైటెక్ సిటీ, గౌతమి నగర్ కాలనీలో మహిళలు పిల్లలు పెద్ద ఎత్తున హోలీ సంబరాలు జరుపుకున్నారు. మార్వాడీలు ఏర్పాటు చేసిన వేడుకలు ఆకట్టుకున్నాయి.



లక్షెట్టిపేట : మండలంలోని ఆయా గ్రామాల్లో, పట్టణంలో హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దలు, యువకులు, పిల్లలు అని తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఎంతో సంతోషంతో హోలీ సంబరాలు చేసుకున్నారు. దీంతో పట్టంలో సందడి వాతావరణం నెలకొంది.

దండేపల్లి : వసంత ఋతువు ఆగమనంలో ఎండిన చెట్లు మోడువారి మళ్ళీ చిగురిస్తాయి కోయిలమ్మల రాగాలు స్వాగతం పలుకుతాయి మార్చి మాసంలో వచ్చిన తొలి హోలీ పండుగ వేడుకలను శుక్రవారం చిన్న పెద్ద వయోబేధం లేకుండా మండలంలోని అన్నీ గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ట్రై కార్ చైర్మన్ కోట్నాక తిరుపతి ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు వెదజల్లుకుంటూ సంభురాలు జరుపుకోగా వీదులన్నీ రంగులమయం అయ్యాయి.

జన్నారం : మండల కేంద్రం తోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామస్తులు మహిళలు యువత హోలీ సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం వ్యాపార సంస్థల యజమానులు బందు పాటించి సంబరాల్లో పాల్గొన్నారు. కులమతాలకు అతీతంగా జరుపుకునే ఏకైక పండుగ హోలీ, ప్రతి ఒక్కరి జీవితం రంగుల హరివిల్లులుగా విరజిల్లాలని పలువురు ఆకాంక్షించారు. గోదావరి నదికి వెళ్లి స్నానాలు ఆచరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకున్నారు.

పోలీసుల బందోబస్తు

మండఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హెూలీ పండుగ పురస్కరించుకొని నిర్వహించే సంబరాలలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా శుక్రవారం మండల కేంద్రం లోని బస్టాండ్ సమీపంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు.. ఏ ఎస్ ఐ బిక్కు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల : ఆదిత్య ఎంక్లేవ్‌లో హోలీ సంబరాలు



మంచిర్యాల : హోలీ వేడుకల్లో వాకర్స్ క్లబ్ సభ్యులు



జన్నారంలో హోలీ వేడుకలు నిర్వహించుకుంటున్న యువకులు



దండేపల్లి : హోలీ వేడుకల్లో పాల్గొన్న స్థానికులు



లక్షెట్టిపేట : హోలీ వేడుకలు నిర్వహికుంటున్న యువత

తాగునీటి సమస్యను పరిష్కరించండి



నవతెలంగాణ-జైపూర్

మిట్టపల్లి గ్రామపంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డులో తీవ్ర నీటి కొరత ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు ముదురుతున్నందున తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయని, ప్రతిదినం నీటి కోసం పంచాయతీ కార్యదర్శిని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.